క్లుప్తంగా

శాకంబరిగా దుర్గమ్మ తల్లి



జి.అగ్రహారంలో శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ

అంబాజీపేట: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన కనక దుర్గ అమ్మవారు శాకంబరిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. సుమారు 200 కేజీల వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు మండపేటకు చెందిన కొప్పాక సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10 వేలు విరాళంగా అందించారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ దాత కుటుంబ సభ్యులను అభినందించారు. కాగా స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.50,613 ఆదాయం వచ్చింది.

దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ అయింది. ఎండోమెంట్స్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నుంచి ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. దేవస్థానం ఆదాయాల ప్రాతిపదికన ట్రస్టు బోర్డు సభ్యులు ఎంత మంది ఉండాలి అన్న అంశాన్ని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. రూ.5 కోట్లలోపు ఆదాయం వస్తున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయానికి 11 మంది సభ్యులతో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయనున్నారు. వీరిలో అయిదుగురు మహిళలు విధిగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఇద్దరు, బీసీలు నలుగురు వీరిలో ఒకరు విధిగా నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన వారై ఉండాలని జీవోలో పేర్కొన్నారు. ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. చైర్మన్ పదవితో పాటు ట్రస్టు బోర్డు సభ్యులు పదవులు పొందేందుకు లాబీయింగ్ మొదలుపెట్టారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానిక కొత్త కాలనీకి చెందిన గోకవరపు ప్రకాష్ వయస్సు (42) గతంలో క్యాటరింగ్ పని చేసేవారు. ఐదేళ్ల నుండి కిడ్నీ, లివర్, హార్ట్, సుగర్ వ్యాధులతో ఏ పని చేసుకోలేక ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఇప్పటి వరకు సొంత డబ్బులతో వైద్యం చేయించుకున్నారు. ఇంక వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో కొత్త కాలనీలో ప్రకాష్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కును సాయంగా అందజేశారు.

పలువురికి మాజీ మంత్రి పరామర్శ

మలికిపురం: మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. లక్కవరంలో మృతి చెందిన నంబూరి రామకృష్ణంరాజు కుటుంబ సభ్యులను, మలికిపురంలో ఇటీవల రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ మాజీ అధ్యక్షుడు కడలి సింహాచలం భార్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కడలి సుబ్రహ్మణ్యంను ఆయన పరామర్శించిన మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు గుబ్బల మనోహర్, దొమ్మేటి ఉమ, గుబ్బల బాబ్జి తదితరులు వేణు వెంట ఉన్నారు.

సిరుల తల్లికి.. ప్రణమిల్లి

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- షడ్రసోపేతమైన పిండివంటల నైవేద్యం
- ముత్తైదువలకు వాయనాల సమర్పణ

కొత్తపేట: లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం.. శ్రీరంగధామేశ్వరీం.. దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం.. అంటూ మహిళా లోకం సిరుల తల్లికి ప్రణమిల్లింది. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి ముందు మూడో శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఇంటింట మహాలక్ష్ములు చల్లని తల్లి వరలక్ష్మిని భక్తితో కొలిచారు. ప్రత్యేక పూజలు చేసి వ్రతమాచరించారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో గ్రామగ్రామాన దుర్గాదేవి, లక్ష్మీదేవి ఆలయాలు, గ్రామ దేవతలు, అమ్మవారి ఆలయాలను విశేషంగా అలంకరించారు. ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి, కుంకుమార్చనలు, పలు ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముఖ్యంగా హిందూ సంప్రదాయ కుటుంబాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా దేవుని మందిరాన్ని, దేవతామూర్తుల చిత్రపటాలను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పలు కుటుంబాల్లో అయితే వారి ఆనవాయితీ ప్రకారం పాలవెల్లిని తోరణాలు, పండ్లతో అలంకరించారు. అష్టోత్తర శతనామాలతో వరలక్ష్మీదేవిని పూజించారు. షడ్రసోపేతమైన వివిధ రకాల పిండివంటలను నైవేద్యంగా అమ్మవారికి నివేదించారు. అనంతరం చుట్టుపక్కల ముత్తైదువలను ఆహ్వానించి వాయనాలు, తాంబూలాలు అందజేసి వారి నుంచి ఆశీస్సులు పొందారు. కొత్తపేట బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారికి ఆలయ పోషకుడు బొరుసు వెంకట ఉదయ భాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



విశేష అలంకరణలో ఆత్రేయపురం లక్ష్మీదేవి

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వరలక్ష్మీవ్రతం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్తలు పాతపాటి రామాంజనేయరాజు, పాతపాటి వెంకటసత్యనారాయణరాజు సూచనల మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆలయ నిర్వాహకుడు గోరింట విజయకుమార్‌రాజు ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ మహిళలు సామూహిక కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం పండితుల ఆశీర్వచనం పొంది, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆత్రేయపురం మండలంలో మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మహిళలుతమకు కోరిన వరాలు సిద్ధించేలా చేసుకొనే పండుగలలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమికి ముందు శుక్రవారాన్ని వరలక్ష్మి శుక్రవారంగా మహిళలు ఈ పండగను చేసుకొంటామని పలువురు తెలిపారు. తమ సౌభాగ్యం కలకాలం పాటు నిలవాలని సిరిసంపదలతో తులతూగాలని అలాంటి వరాలు తమకు ఇవ్వాలంటూ మహిళలు కోరుకొంటారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు మహిళలు భౌతిక దూరం పాటిస్తూ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.



అలమూరులో వేంచేసిన సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



అంతర్వేది ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజలు

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. మహిళలు బంగారు రూపులను ధరించి ఇంట్లోనే అమ్మవారిని చక్కగా అలంకరించి నైవేద్యాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలమూరులోని నాగుల చెరువు సమీపంలోని సంతోషిమాత ఆలయం భక్తులతో కిక్కిరిసింది. పలు ఆలయాల వద్ద నిర్వాహకులు సాంస్కృతిక, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మీ తాయారు అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహికంగా వరలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ నేతృత్వంలో అర్చకుడు సుదర్శనం రమేష్ ఈ కుంకుమ పూజలు చేయించారు. దేవస్థానం తరుపున ఎటువంటి పూజా రుసుము లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి వారికి సిబ్బంది అందజేశారు. రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారికి పూజల అనంతరం లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం, ప్రసాదం వితరణ అర్చకులు చేశారు. తదనంతరం నిత్యాన్నదానంలో భోజన వసతిని భక్తులకు ఏసీ ప్రసాద్ పర్యవేక్షణలో దేవస్థానం సిబ్బంది కల్పించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మండల పరిధి పలు గ్రామాల్లో శుక్రవారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊబలంకలో సర్వమంగళ సమేత ఉమా మహేశ్వరస్వామి, రావులపాలెం, ఈతకోట గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి ఆలయాలతో పాటు పలు శివాలయాలు, రామాలయాల్లో వరలక్ష్మీ వత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, స్వామివారి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు.



ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరుని ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అయినవిల్లిలో..

అయినవిల్లి: ముక్తేశ్వరంలో ముక్తికాంత సమేత క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీదేవి అమ్మవారికి శ్రావణ మాసం మూడో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. మహిళ భక్తులు అమ్మవారికి పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లలిత సహస్ర పారాయణ చేశారు. అలాగే అయినవిల్లి, నేదునూరు, విలస, సిరిపల్లి గ్రామాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

చంద్రబాబు మోసాలపై అవగాహన కల్పించాలి



గుడిమూలలో నిర్వహించిన ఇంటింటికీ వంచన కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరించిన గొల్లపల్లి సూర్యారావు



ఊబలంకలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శ్రీనివాసరావు తదితరులు

సఖినేటిపల్లి: ఏడాది పాలనలో చంద్రబాబు మోసపూరిత హామీలపై గ్రామ స్థాయిలో ప్రజలకు పార్టీ కేడర్ అవగాహన కల్పించాలని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, కేశవదాసుపాలెం గ్రామాల్లో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్రతో కలసి గొల్లపల్లి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వంచన పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యతన ఈ మేరకు జరిగిన గ్రామ స్థాయి సమావేశాల్లో గొల్లపల్లి మాట్లాడుతూ, ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుదకధి చెప్పాలని, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. పరిశీలకుడు నాగేంద్ర మాట్లాడుతూ, మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే ఇంటింటికీ గొల్లపలి, నాగేంద్ర వంచన కరపత్రాలను పంపిణీ చేస్తూ, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలు ఏ మేరకు నష్టపోయారో కూడా వివరించారు. గ్రామ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోన ప్రభాకర్, మోకా చింటూ, చెల్లింగి నాగరాజు, దీపాటి రాజేష్, ఎల్.సుబ్బరాజు, నడింపల్లి రామచంద్రరాజు, ముత్యాల రామారావు, యెనుముల చిట్టిబాబు, జిల్లెళ్ళ చంద్రశేఖర్, రుద్రరాజు చినరాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం

రావులపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని రావులపాలెం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఊబలంకలో శుక్రవారం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు మహిళలకు మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కటే ఇచ్చారన్నారు. అలాగే బీసీలకు ఇస్తామన్న ప్రతి హామీని నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని, తల్లికి వందనం ఊసే లేదని, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఏడాది దాటినా అమలు చేయకపోవడం ప్రజలను మోసగించడంలో చంద్రబాబు తీరు మరోసారి స్పష్టమవుతుందన్నారు. అలాగే బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ 45 రోజుల కార్యక్రమంలో భాగంగా నియోజవర్గ స్థాయి, మండల స్థాయిలో సమావేశాలు పూర్తిచేసుకుని గ్రామాల వారీగా ఇంటింటా ప్రచారం మొదలు పెట్టమన్నారు. మండలంలో మొట్టమొదటిగా ఊబలంకలో కార్యక్రమం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ బొక్కా కరుణాకర్, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు కర్రి గోవింద కృష్ణారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మల్లిడి రామిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బిరామిరెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి సత్తిరెడ్డి, సఖినేటి వాకులరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే బీసీలపై దాడులు

మలికిపురం: బడుగు బలహీన వర్గాల నేతలపై కూటమి ప్రభుత్వం ఓ పథకం ప్రకారం దాడులు చేయిస్తూ రాష్ట్రంలో ఆ సామాజిక వర్గీయులపై కక్ష సాధింపులకు పాల్పడుతుందని రాజోలు నియోజకవర్గ యాదవ సంఘం ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మలికిపురంలో విలేకరులు మాట్లాడుతూ కడప జిల్లా పులివెందుల రూరల్ మండలంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేసి గాయపరిచిన ఘటనను నిరసిస్తూ యాదవ సంఘం ప్రముఖులు తమ నిరసనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మందపాటి రత్నం, మాజీ ఎంపీటీసీ గుండుమేము నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ గుండుమెను సూర్యచంద్రరావు, మాజీ ఎంపీటీసీ మందపాటి శ్రీరామకృష్ణ, కందుల విజయ్ కుమార్, కానుబోయిన వెంకటరత్నం, గుండుమేను పెద్దిరాజు, బేసబోయిన ఏసుబాబు, గోపాలకృష్ణ, మందపాటి నాని ఈ దాడిని ఖండించారు.

అనుబంధాన్ని తెలిపేది రక్షాబంధన్

కొత్తపేట: సోదరుడు, సోదరిల మధ్య అనుబంధాన్ని తెలిపేది రక్షాబంధన్ పండగ అని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శివపరమాత్మ స్థానిక ఓంశాంతి మందిరం సభ్యులు అన్నారు. శనివారం శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి) పురస్కరించుకుని ముందుగా శుక్రవారం ఓంశాంతి మందిరం ఆధ్వర్యంలో ప్రముఖులకు బ్రహ్మకుమారీలు సోదరులకు రాఖీ కట్టే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సందేశాన్ని ముఖ్యంగా రాఖీ పండుగ ప్రాముఖ్యతను వారు వివరించారు. 'శివపరమాత్మ రక్షాబంధన్' అంటే శివుడు, పరమాత్మ, రక్షాబంధన్ కలయిక అని, ఇది రక్షాబంధన్ పండగ రోజున శివుడు – పరమాత్మ సంబంధాన్ని సూచిస్తుందని అన్నారు. అయితే ఆధ్యాత్మికంగా చూస్తే ఈ పండుగ జీవాత్మ, పరమాత్మల మధ్య అనుబంధాన్ని సూచిస్తుందన్నారు. రక్షాబంధన్ నాడు సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి అతని క్షేమం కోరుకుంటుందన్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఐఎస్ రాజు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్, డాక్టర్ కాశిన గేయానంద శేషుబాబు, డాక్టర్ సత్యవరపు గాంధీ, డాక్టర్ మెంటే ఉదయ భాస్కరరావు, వివిధ బ్యాంక్‌ల బీఎంలకు నుదుట తిలకం దిద్ది, రాఖీలు కట్టి, ప్రసాదం పంపిణీ చేశారు.

వినోద్ కార్టూన్ ప్రథమ బహుమతికి ఎంపిక

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన టీచర్, ప్రముఖ కార్టూనిస్ట్ చింతా వినోద్ గీసిన యుద్ధం వల్ల నష్టాలు కార్టూన్ ప్రథమ బహుమతికి ఎంపికైంది. వివరాలు శుక్రవారం ఆయన మీడియాకు చెప్పారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక 13వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో ఆయనకు ఈ గుర్తింపు వచ్చింది. ఈ మేరకు ఈ నెల 10వ తేదీన విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో వినోద్‌ను నగదు బహుమతి, జ్ఞాపికతో సత్కరించనున్నారు.



వినోద్‌కు గీసిన యుద్ధం వల్ల నష్టాలు కార్టూన్

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

అమలాపురం టౌన్: అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ నిబంధనలను సవరిస్తూ దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించనున్న ఎల్ఆర్ఎస్ స్కీమ్ పొడిగింపును అమలాపురంలోని అనధికార లే అవుట్ల రియల్టర్లు, కొనుగోలు చేసిన ప్లాట్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. 2025 జూన్ 30వ తేదీకి ముందు కొనుగోలు చేసిన వారు మాత్రమే ఈ స్కీమ్‌కు అర్హులని తెలిపారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్వీకరణకు వచ్చే అక్టోబర్ 24వ తేదీ తుది గడువు అని కమిషనర్ స్పష్టం చేశారు. రియల్టర్లు, ప్లాట్‌దారులు గడువులోపు స్పందించాలని సూచించారు.

పీజే సుధాకర్ పేరిట స్మారక అవార్డు

రావులపాలెం: 120 డిగ్రీలతో పాటు ఎన్నో డాక్టరేట్ సాధించిన విద్యావేత్త పీజే సుధాకర్ పేరిట ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా స్మారక అవార్డు ప్రదానం చేస్తున్నట్టు అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ జనరల్ సెక్రటరీ దుళ్ళ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మృతి చెందిన పీజే సుధాకర్ సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. సంస్థకు ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన ప్రముఖులకు, విద్యావేత్తలకు సుధాకర్ స్మారక అవార్డును అల్లూరి సీతారామరాజు జయంతి, వార్షికోత్సవ సందర్భంగా అవార్డును ప్రదానం చేయనున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

న్యాయవాద గుమస్తాల సేవలు అభినందనీయం

రాజోలు: కోర్టుల్లో న్యాయవాద గుమస్తాలు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి అన్నారు. న్యాయవాద గుమస్తాగా 50 ఏళ్ల సేవలు అందించిన గోళ్ల రామచంద్ర వీరాచార్యులు దంపతులతో పాటు 40 ఏళ్ల పైబడి న్యాయవాద గుమస్తాలుగా సేవలు అందించిన వాడ్రేవు వెంకటేశ్వరరావు, అనిశెట్టి సత్యనారాయణ, ఆకుల సూర్యనారాయణ, గెల్లి త్రిమూర్తుల దంపతులను ఘనంగా సత్కరించారు. వాడ్రేవు ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు, సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు ఆధ్వర్యంలో రాజోలు బార్ అసోసియేషన్‌లో జరిగిన సత్కార కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కక్షిదారులకు, న్యాయవాదులకు సంధానకర్తలుగా ఉంటూ కోర్టులో సమయానికి అవసరమైన దస్త్రాలను దాఖలు చేయడంలో న్యాయవాద గుమస్తాల పాత్ర కీలకమన్నారు. న్యాయవాద గుమస్తాల పనితీరు కారణంగానే సంబంధిత న్యాయవాదులు మంచి పేరు గడిస్తారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి అయ్యప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శి చింతా ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు వెంపరాల కామేశ్వరరావు, పీవీ కృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, పొన్నాడ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాద గుమస్తా గోళ్ల వీరాచార్యుల దంపతులను సత్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

మామిడికుదురు: మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం శుక్రవారం మామిడికుదురులో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సభకు మండల శాఖ అధ్యక్షుడు నయనాల రఘురామయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మళ్లీ నయనాల రఘురామయ్య ఎన్నికయ్యారు.
ప్రధాన కార్యదర్శిగా గెద్దాడ నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా జగతాడి రామకృష్ణసోమరాజు, ఉపాధ్యక్షులుగా కాట్రాడి వెర్రియ్య, బాలం రామకృష్ణ, గుత్తుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా తాడి లక్ష్మీసౌజన్య, మొల్లేటి నాగవెంకటేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు కొత్తపల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



అధ్యక్షుడిగా ఎన్నికైన రఘురామయ్యను సత్కరిస్తున్న ఉద్యోగులు

కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు

మామిడికుదురు: కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. లూటుకుర్రు గ్రామానికి చేరుకుని ఉన్న పాశర్లపూడిలంక వాసులకు తాగునీరు అందించేందుకు నూతనంగా పైప్‌లైన్ వేసి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ కుళాయిలను సర్పంచ్ శుక్రవారం ప్రారంభించారు. తమ గ్రామానికి చేరువలో ఉన్న పాశర్లపూడిలంక వాసులు తాగునీటి కోసం ఎంతో కాలం నుంచి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి తాగునీటి కష్టాలు తీర్చేందుకు పైప్‌లైన్ నిర్మించి వారి సమస్యను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బోనం అబ్బులు, పాలూరి పెద్దిరాజు, స్థానికులు పాల్గొన్నారు.



లూటుకుర్రులో తాగునీటి కుళాయిని ప్రారంభించిన సర్పంచ్ తాతకాపు

డ్రై డే పాటిద్దాం.. అంటు వ్యాధులను నిర్మూలిద్దాం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించడం ద్వారా దోమల సంచారాన్ని అరికట్టి అంటువ్యాధులను నిర్మూలించవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఫ్లకార్డులు ప్రదర్శించి దోమల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అలాగే రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. దీనివల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.



చింతలూరులో ద్రోమల నిర్మూలనపై భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది